నమస్తే తెలంగాణ
నిజామాబాద్, శుక్రవారం 15 నవంబర్ 2024
FRIDAY, NOVEMBER 15, 2024

టీయూలో కబడ్డీ పోటీలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ

డిచ్‌పల్లి, నవంబర్ 14 : తెలంగాణ యూనివర్సిటీలో ఇంటర్ కాలేజీ కబడ్డీ ఉమెన్స్ టోర్నమెంట్‌ను వీసీ ఆచార్య టి.యాదగిరిరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతో పాటు ఆటలకు సమప్రాధాన్యం ఇస్తామన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా ముందుండాలన్నారు. విన్నర్‌గా గిరిరాజ్ కళాశాల, రన్నర్‌గా యూనివర్సిటీ కళాశాల నిలిచింది. టోర్నమెంట్ నిర్వహణలో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ బీఆర్ నేత, వివిధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆలయ భూముల పరిశీలన

సుభాష్‌నగర్, నవంబర్ 14: జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన భూములను కబ్జాచేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సహాయ కమిషనర్ విజయరామారావు హెచ్చరించారు. గురువారం బడా రాంమందిరం, నీలకంఠేశ్వరాలయం తదితర ఆలయాలకు సంబంధించి భైంసా, బాల్కొండలో ఉన్న భూములను స్థానిక సర్వేయర్‌తో పరిశీలించారు. ప్రస్తుతం ఈ భూములు కబ్జా గురైనట్లు కమిషనర్ తెలిపారు. భైంసా మండలం మంజ్రీ, సిరాల, కుబీర్ మండలం నిక్వా గ్రామాల్లో భూమిని పరిశీలించినట్లు పేర్కొన్నారు. జిల్లా దేవాదాయ శాఖ పరిశీలకులు కమల, ఈవో వేణు, ప్రశాంత్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌లో పశువైద్య శిబిరం

సారంగాపూర్, నవంబర్ 14 : నిజామాబాద్ మండలంలోని శ్రీనగర్ గ్రామంలో నేషనల్ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పాడి పశువులకు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశు సంవర్ధకశాఖ టెక్నికల్ ఎడి డాక్టర్ గంగాధరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 32 పాడి పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు. 32 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. 18 పశువులకు సాధారణ చికిత్స చేసి మందులు అందజేశారు. పోషకాహారంతో కూడిన మినరల్ ప్యాకెట్లను పాడి రైతులకు అందజేశారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ఖలీల్‌వాడి, నవంబర్ 14 : గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో గ్రంథాలయ అధికారి పూర్ణచందర్ ఆధ్వర్యంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రఫిక్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రంగారత్నం, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ గంగాధర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రంథాలయ ప్రయోజనాలతోపాటు గ్రంథాలయాల ఉద్యమాలు, గ్రంథాలయాల చరిత్రపై విద్యార్థులకు అధ్యాపకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ రామస్వామి, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ రమేశ్, అకాడమిక్ సమన్వయకర్తలు రాజేశ్, రాహుల్, వివిధ అధ్యాపకులు అనసూయ, రమణ, నహీదబేగం, సుభాషినిదేవి పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు నిర్వహించండి

డిచ్‌పల్లి, నవంబర్ 14: టీయూ ఎల్ఎల్‌బీ విభాగంలో మిగిలిపోయిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయాలని స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల రవి కోరారు. ఈ మేరకు గురువారం వీసీ ప్రొఫెసర్ యాదగిరి రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఇతర అనుబంధ పీజీ కళాశాలలో మిగిలిపోయిన సీట్లను కూడా స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయాలని విన్నవించారు. వర్సిటీలో ఇంజనీరింగ్, ఫార్మా, ఇతర డిమాండ్ ఉన్న వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

మెంట్రాజ్‌పల్లి కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

డిచ్‌పల్లి/ఎడపల్లి/ ఆర్మూర్ టౌన్, నవంబర్ 14 : రైతుకు నష్టం చేకూర్చే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. ఎక్కడ కూడా తరుగు, కడ్తా పేరుతో కోతలు విధించకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జిల్లాలోని డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి, ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామాల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు, స్థానిక ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డితో కలిసి పర్యటించారు. మెంట్రాజ్‌పల్లి, ఠానా కలాన్‌లో కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల సౌకర్యార్థం అందుబాటులోని సదుపాయాలు తనిఖీ చేశారు. కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులను పలకరించి ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం ప్రతి కేంద్రానికి ఒక అధికారి చొప్పున నియమించాలని, అవసరమైతే ఇతర శాఖల అధికారులకు ధాన్యం సేకరణపై శిక్షణనిచ్చి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మెంట్రాజ్‌పల్లిలో సర్వే ద్వారా వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక రైతువేదికలో మంత్రి రైతులతో భేటీ అయ్యారు. ఆర్మూర్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపనచేశారు.

కొనుగోళ్లపై సమీక్ష

కంఠేశ్వర్, నవంబర్ 14 : లెవీ సేకరణ, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం సాయంత్రం సంబంధిత అధికారులుతో సమీక్ష నిర్వహించారు. ఎవరూ ఏ విషయంలోనూ ప్రశ్నించే పరిస్థితి తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, రాష్ట్రంలోనే జిల్లాను ఆదర్శంగా నిలుపాలని మంత్రి సూచించారు.వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నందున నిల్వలను తిరిగి అందించడంలో విఫలమైన రైస్‌మిల్లర్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి సంబంధిత అధికారులను ఆదేశించారు. లెవీ లక్ష్యానికి విఘాతం కల్పించిన మిల్లర్లపై అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను ప్రయోగించాలన్నారు. అనంతరం నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. మంత్రితోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన నివాళులర్పించారు.

సంక్షిప్తంగా..

- **నేడు గురునానక్ జయంతి :** సుభాష్‌నగర్, నవంబర్ 14 : గురునానక్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట గురుద్వార్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు గురుగ్రంథ్ శోభాయాత్ర, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రబంధక్ కమిటీ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 9గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.
- **వీహెచ్‌పీ కమిటీల ఎంపిక :** సుభాష్‌నగర్, నవంబర్ 14 : విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయంలో గురువారం పలు ప్రాంతాలకు సంబంధించి ప్రఖండ కమిటీలను ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాకూర్ గురువారం పత్రిక ప్రకటనలో తెలిపారు. గాజుల్‌పేట, వినాయక్‌నగర్, కోటగల్లీ, ఎల్లమ్మగుట్ట ప్రాంతీయ కమిటీల్లో 50 మంది కార్యకర్తలను ఎన్నుకొని బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, ఉపాధ్యక్షుడు ఆనంద్, సహాయ కార్యదర్శి దాత్రిక రమేశ్, కోశాధికారి నాంపల్లి శేఖర్, నగర కార్యదర్శి రామ్‌ప్రసాద్ చటర్జీ తదితరులు పాల్గొన్నారు.
- **ఘనంగా భీమన్న పండుగ:** డిచ్‌పల్లి, నవంబర్ 14 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామం ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం భీమన్న పండుగను ఘనంగా నిర్వహించారు.అర్చకులు ప్రదీప్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు గంగాధర్, శేఖర్, సాయిలు, మోహన్, శ్రీను, సాగర్, బాలయ్య, సాయిబాబా, కిషన్, ఎర్రన్న, రాజు, సతీశ్, భక్తులు పాల్గొన్నారు.
- **వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి:** ధర్పల్లి, నవంబర్ 14 : దవాఖానలో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ రోగులకు వైద్యసేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆమె తనిఖీ చేశారు. ప్రసవాలు, ఓపీ, డెలివరీ రిజిస్టర్లను పరిశీలించి మాట్లాడారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.
- **నేడు గురు గంగాధరయ్య జాతర:** ధర్పల్లి, నవంబర్ 14: మండలంలోని వాడీ గ్రామపరిధిలో ఉన్న గురు గంగాధరయ్య స్వామి ఆలయ జాతర 39వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు గ్రామ పద్మశాలీ సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.
- **పసుపు రైతులకు అవగాహన సదస్సు:** సిరికొండ,నవంబర్14: మండలంలోని గడ్కోల్ గ్రామ రైతువేదికలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో స్పైస్‌బోర్డు సహకారంతో పసుపు రైతులకు అవగాన కల్పించారు. స్పైస్‌బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్ మాట్లాడుతూ.. పసుపు సాగు పద్ధతులను వివరించారు. బెడ్‌సిస్టంలో పసుపు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని తెలిపారు.
- **లింబాద్రి గుట్టకు ప్రత్యేక బస్సు సౌకర్యం:** సిరికొండ,నవంబర్14: సిరికొండ నుంచి లింబాద్రి గుట్టకు శుక్రవారం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించిట్లు బస్టాండ్ ఇన్‌చార్జి లింగం గురువారం తెలిపారు. జాతర సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారనిపేర్కొన్నారు. పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20 చార్జీ ఉంటుందని తెలిపారు.
- **రేషన్ బియ్యం పట్టివేత:** సిరికొండ, నవంబర్ 14 : మండలంలోని కొండూర్ గ్రామంలో గురువారం అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా ఎస్సై రామ్, ఆర్ఐ గంగారాజం కలిసి పట్టుకున్నారు. బైక్‌పై మక్కా అటుకులు అమ్ముతూ రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని ఇటుక బట్టి కూలీలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. క్వింటాలు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాలికలకు రక్తహీనతపై అవగాహన

ఇందల్వాయి , నవంబర్ 14: మండలంలోని తిర్మన్‌పల్లిలో గిరిజన బాలికల పాఠశాల, కళాశాలలో కౌమార దశ బాలికలకు రక్తహీనతపై మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ గురువారం అవగాహన కల్పించారు. 'ఎనీమియా ముక్త్ భారత్' అనే కార్యక్రమం కింద తెలంగాణ గిరిజన బాలికల పాఠశాల, కళాశాలలో 220 మంది పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఆహారంలో పూర్తి స్థాయిలో తాజా ఆకు కూరలు, బీట్‌రూట్, పాలు, బెల్లం, పల్లీలు అధికంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్‌అలీ, హెచ్ఎం పద్మ, ఆరోగ్య సిబ్బంది శారద, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, ఫార్మాసిస్ట్ మౌనిక, సుమలత, స్టాఫ్ నర్స్ స్రవంతి, ఆశ కార్యకర్త ప్రమీల పాల్గొన్నారు.

సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం

వర్నిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

రుద్రూర్, నవంబర్14: వర్ని మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్యపై విచారణ చేపట్టి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసిన ఏబీవీపీ నాయకులపై ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బందితో దాడి చేయించడాన్ని ఖండించారు. దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి సంఘం నాయకులు ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, కనీసం రాష్ట్ర ప్రభుత్వం స్పందిచకపోడం సిగ్గుచేటన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

వేతనాలు ఇవ్వాలని ఆదర్శ ఉపాధ్యాయుల నిరసన

పాఠశాల ఎదుట నిరసన చేపట్టిన ఉపాధ్యాయులు

రుద్రూర్, నవంబర్14: మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాలలో ఉపాధ్యాయులు వేతనాల కోసం గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతినెల తమ వేతనాలు బ్యాంక్ ఖాతాలోనే వేయాలని, బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సవీష్, చెన్నప్ప, బలరాం, ఫిరోజ్, చంద్రశేఖర్, రాఘవేంద్ర, రఘు, అనిల్, సంతోష్ కాంబ్లే, సాయికృష్ణ, జ్యోతి తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ సేవలు నిలిపివేత అవాస్తవం

డీఐజీ రమేశ్‌రెడ్డి

ఖలీల్‌వాడి, నవంబర్ 14 : ఉమ్మడి జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు నిలిపివేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమైనవని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిజామాబాద్ డీఐజీ రమేశ్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలందించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఎలాంటి బంద్‌లు పాటించడం లేదని స్పష్టం చేశారు. కొందరు దస్తావేజు లేఖర్లు మాత్రమే సేవలు నిలిపివేసినట్లు దృష్టికి వచ్చిందని, దానికి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తెరిచి ఉన్నాయని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. నేరుగా సంబంధిత సబ్‌రిజిస్ట్రార్లను సంప్రదించి యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చని తెలిపారు

మార్కెట్‌లోకి 'నూతన స్విఫ్ట్ డిజైర్'

నూతన కారును ఆవిష్కరిస్తున్న మేయర్ నీతూకిరణ్

ఖలీల్‌వాడి, నవంబర్ 14: వాహన తయారీలో దిగ్గజమైన మారుతీ సుజికీ ఆల్ ఇండియా నంబర్ వన్ డీలర్ అయిన వరుణ్ మోటర్స్ నుంచి సరికొత్త 5 స్టార్ రేటింగ్ పొందిన డజిలింగ్ డిజైర్ నూతన కారుని జిల్లా కేంద్రంలోని వరుణ్ మోటార్స్‌లో నగర మేయర్ దండు నీతూ కిరణ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ.. అన్ని ఫీచర్స్, అత్యాధునిక టెక్నాలజీతో కారును రూపొందించినట్లు తెలిపారు. మొదట నీరడి గంగరాజు, రెండోది వివేక్ కారును సొంతం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రమణాగుప్తా, ఏజీఎం సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పొద్దు తిరుగుడు విత్తనాల పంపిణీ

పొతంగల్, నవంబర్ 14 : మండలంలోని హెగ్డోలి రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత పథకం కింద పొద్దు తిరుగుడు విత్తనాలను మండల అగ్రికల్చర్ ఆఫీసర్ నిషిత స్థానిక నాయకులతో కలిసి రైతులకు గురువారం పంపిణీ చేశారు. సాగు చేసి, మంచి దిగుబడి సాధించి లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుప్పాల శంకర్, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, ఏఈవో శంకర్, రైతులు ఉన్నారు.

అడవి మామిడిపల్లి వద్ద ఆర్వోబీ పనులు

- నెలరోజులపాటు ట్రాఫిక్ మళ్లింపు
- వాహనదారులు గమనించాలి
- ఏసీపీ(ట్రాఫిక్) నారాయణ

మాక్లూర్/ వినాయక్‌నగర్, నవంబర్ 14: నిజామాబాద్ జిల్లా పరిధిలోని మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి వద్ద ఆర్వోబీ (రైల్వే ఓవర్‌బ్రిడ్జి) పనులు కొనసాగుతున్నాయని ఏసీపీ(ట్రాఫిక్) నారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల10 నుంచి డిసెంబర్10వతేదీ వరకు ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ నుంచి ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, జగిత్యాల వెళ్లే మార్గాల్లో దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

దారి మళ్లింపు ఇలా..

భారీ వాహనాలు: నిజామబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్లే భారీ వాహనాలు డిచ్‌పల్లి బైవే(ఎన్‌హెచ్-44)పై నుంచి ఆర్మూర్ చేరుకోవాలి. ఆర్మూర్ నుంచి నిజామబాద్ వచ్చే భారీ వాహనాలు డిచ్‌పల్లి హైవే (ఎన్‌హెచ్44) నుంచి నిజామబాద్ చేరుకోవాలి.

ఆర్టీసీ బస్సులు: ఆర్మూర్ వెళ్లే బస్సులు వయా చిన్నాపూర్, కల్లడి, ఆలూర్ గ్రామాల మీదుగా ఆర్మూర్ చేరుకోవాలి. ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సులు ఇదే మార్గం నుంచి రావాల్సి ఉంటుంది. కాగా.. భారీ వాహనాలు, ఇతర వాహనాల ప్రయాణికులు రైల్వే పనులు జరుగుతున్న బ్రిడ్జి వద్దకు చేరుకొని తమకు తెలియదని ఇబ్బందులు పడుతున్నారని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. దాస్‌నగర్, చిన్నాపూర్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేశామని, గమనించాలని సూచించారు. వాహనాల దారి మళ్లింపును గుర్తించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేటి బాలలే రేపటి సమాజ నిర్మాతలు

- ఘనంగా బాలల దినోత్సవం
- పాఠశాలల్లో 'స్వయం పాలన'
- వేషధారణతో ఆకట్టుకున్న చిన్నారులు

ఎస్సారెస్పీ వద్ద ఉత్సవాల్లో పాల్గొన్న ఉద్యోగులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, నవంబర్ 14 : భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నేటి పిల్లలే రేపటి సమాజ నిర్మాతలు అని అన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద నెహ్రూ, ఆర్.విద్యాసాగర్‌రావు జయంతిని నిర్వహించారు. డీఈఈ గణేశ్ మాట్లాడుతూ.. నెహ్రూ అభివర్ణించిన విధంగా ఎస్సారెస్పీ ఉత్తర తెలంగాణకు ఆధునిక దేవాలయంగా మారిందన్నారు. సాగునీటి రంగానికి విద్యాసాగర్‌రావు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో డీఈఈ సుకుమార్, డీఎస్ఈ లాల్‌సింగ్, ఏఈఈలు మాణిక్యం, పవన్, రాహుల్, వంశీ, శ్యామ్, జునిద్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నందిపేట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాల్కొండలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను అలరించాయి. పాఠశాల డైరెక్టర్లు కోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మణ్, ప్రిన్సిపాల్ విజయ్‌కర్తన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు గణేశ్, సుకుమార్, శ్రీనివాస్, శ్రావణి, విజయలక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెంజల్, నవీపేట్ మండలాల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. బోర్గాం శివారులోని ఉషశ్రీవిద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నవీపేట్ మండలంలోని బినోల పాఠశాలలో 210 మంది విద్యార్థులకు నిజామాబాద్‌కు చెందిన వ్యాపారి అర్జున్ రాథోడ్ గ్లాసులను బహూకరించారు. నవీపేటలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించారు. ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం కొమరగిరి కృష్ణాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముప్కాల్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు అనన్యయాదవ్, అక్షయ్, హీనాలను పోలీసు శాఖ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ చవాన్ రాజేందర్, ఏఎస్సై తొగర్ల నరేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్కు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. ఆలూర్‌లో సొసైటీ డైరెక్టర్ దేగం ప్రమోద్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు హెచ్ఎం సురేశ్ తదితరులు బహుమతులను అందజేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు టీజీ ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ రవీందర్ చేతుల మీదుగా నిజామాబాద్‌లో పండ్ల కిట్లను అందజేసి అన్నదానం చేశారు. ఆంజనేయులు, రవీందర్, రాజేశ్, రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు. ధర్పల్లిలోని లిటిల్ హర్ట్స్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో మెజిషియన్ శ్రీకాంత్ చేసిన మ్యాజిక్ షో విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది. సిరికొండలోని సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రుద్రూర్, వర్ని మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పొతంగల్‌లోని జడ్పీ ఉన్నత, ప్రాథమిక, ప్రైవేట్ పాఠశాలలతో పాటు కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. వివిధ వేషధారణలో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

నగరంలోని ఇంద్రాణి పాఠశాలలో..

అనన్యా యాదవ్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

పొతంగల్‌లో..

ఘనంగా సహకార వారోత్సవాలు

ఉత్సవాల్లో పాల్గొన్న మాక్లూర్ పీఏసీఎస్ చైర్మన్ అశోక్

మోర్తాడ్/ ఏర్గట్ల/ మాక్లూర్/ రుద్రూర్, నవంబర్ 14: సహకార వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మోర్తాడ్‌లో సొసైటీ చైర్మన్ కల్లెం అశోక్ సహకార జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, కార్యదర్శి కాశీరాం, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఏర్గట్లలో సొసైటీ చైర్మన్ బర్మ చిన్ననర్సయ్య, తాళ్లరాంపూర్‌లో చైర్మన్ పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించారు. పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. మాక్లూర్ పీఏసీఎస్ లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్లు బూరోళ్ల అశోక్, గుండారం శేఖర్, కార్యదర్శి ప్రవీణ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. రుద్రూర్ మండలంలోని రాయకూర్ సొసైటీ వద్ద విండో వైస్ చైర్మన్ అరుణ్‌కుమార్ జెండాను ఆవిష్కరించిన అనంతరం రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాస్, సత్తయ్య, నాయకులు గోవింద్‌రావు, చందు తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి ఎత్తిపోతల పథకం మోటర్లు చోరీ

రెంజల్, నవంబర్ 14: మండలంలోని కందకుర్తి గ్రామ శివారులో ఉన్న ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ స్టేజ్ -2 పంప్‌హౌస్ వద్ద 5హెచ్‌పీ మోటర్లను గురువారం గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారని రైతులు తెలిపారు. కందకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా కందకుర్తి, నీలా, బోర్గాం గ్రామాల రైతులు పొగాకు, శనగ పంటలకు సాగునీరు అందించేందుకు కాలువ పూడికతీత పనులకు సిద్ధమవుతున్నారు. ఇదే సమయంలో స్టేజ్ -2 పంప్‌హౌస్ వద్ద రెండు 5హెచ్‌పీ మోటర్ల కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో రైతులు గాలించారు. కొంతదూరంలో మోటరు వదిలేసి వెళ్లారని రైతులు తెలిపారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా.. ఎస్సై సాయన్న ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-II, Dist. Nizamabad agreed to accord Loan to Madani Swapna W/o Madani Ganesh Kumar, Age 46 Yrs, Occ:Business, R/o H.No.Flat No.304, Vinayak Nagar, Naseem Colony, Siddi Vinayaka Homes Apartment, Nizamabad (Borrower / Property holder) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(7) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

The Part of Open Plot No.11 (Towards Southern side) Open Plot No.12, Open No.13 and Part of Open Plot No.14 (Towards Southern side) (Total Four Plots), as per T.L.P. No.107/2020/H, e.p.No.19509/505/2020/H issued by the Director of Town and Country Planning Government of Telangana, Hyderabad being part of land comprised in Sy Nos.319, 320/ఆ admeasuring area 538.33 Sq.Yds or 450.09 Sq.Mtrs situated at Nadipally Thanda, Nadipallly Village Shivar, Mandal Dichpally, Nizamabad District within the limits of Gram Panchayat Nadipally, Regn.Sub.Dist Nizamabad Rural and Regn.Dist Nizamabad. Part of Open Plot No.11 Southern side Area 75.00 Sq.Yds Open Plot No.12 Area 180.00 Sq.Yds Open Plot No.13 Area 200.00 Sq.Yds Part of Open plot No.14 Southern side Area 83.33 Sq.Yds Total 538.33 Sq.Yds **As bounded by (Within one Boundary) North ::** Part of Plot No.11 & Part of Plot No.14, **South ::** 33'-0" wide Road, **East ::** 33'-0" wide Road, **West ::** 33'-0" wide Road

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhash Nagar, Nizamabad, Cell:9848094409

18న మధ్యాహ్న భోజనం బంద్

రెంజల్, నవంబర్ 14: ఆర్మూర్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలిని బాధ్యతల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ ఈనెల 18వ తేదీన మధ్యాహ్న భోజనాన్ని నిలిపివేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు రెంజల్ ఎంఈవోకు గురువారం వినతిపత్రం అందజేశారు. 18వ తేదీన ఆర్మూర్‌లో నిర్వహించే నిరసన కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేపూర్‌లో భీమన్న ఉత్సవాలు

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 14: మండలంలోని చేపూర్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో భీమన్న ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. భీమన్న గద్దె, ఉత్సవ మూర్తులకు నాగాపూర్ కాలువ వద్ద అభిషేకం నిర్వహించి, ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం బాధ్యులు, మహిళలు మంగళహారతులు పట్టారు. యువకులు బాణాసంచా కాలుస్తూ ఉత్సవాల్లో సందడిచేశారు. వీడీసీ అధ్యక్షుడు మేడిపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌జాబ్ ట్రైనింగ్‌తో ఉపయోగాలు


విద్యార్థుల సందర్శనను పరిశీలిస్తున్న డీఐఈవో

మోర్తాడ్, నవంబర్ 14: విద్యార్థులకు ఆన్‌జాబ్ ట్రైనింగ్‌తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని డీఐఈవో రవికుమార్ అన్నారు. మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సివిల్ సప్లయి ఆఫీసు సందర్శనను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు ఆన్‌జాబ్ ట్రైనింగ్‌లో అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రూప్-4లో ఉత్తమ ప్రతిభ

భీమ్‌గల్, నవంబర్ 14: మండల కేంద్రానికి చెందిన మోర్తాడ్ శివ గురువారం విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో ప్రతిభ చాటాడు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించాడు. శివ బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్, కాకతీయ యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేశాడు.

గోసంగీలకు న్యాయం చేయాలని వినతి

ఆర్మూర్ టౌన్, నవంబర్ 14: గోసంగి కులస్తులకు న్యాయం చేయాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోసంగి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సాయిచరణ్ మాట్లాడుతూ.. అసలైన గోసంగీలకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

బోధన్, నవంబర్ 14: పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయం ప్రధాన అర్చకుడు గణేశ్ మహరాజ్, అర్చకులు మహేశ్ పాఠక్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో బహుమతులు

ఏర్గట్ల, నవంబర్ 14: బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఏర్గట్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అభిలాష్, వైష్ణవి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపారు. హైదరాబాద్‌లో సినీ రచయిత అందెశ్రీ, తెలంగాణ సాహిత్య సంగీత అకాడమీ చైర్మన్ అలేఖ్య చేతుల మీదుగా గురువారం బహుమతులు అందుకున్నారు.

తీరిన నీటి కష్టాలు

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 14: పట్టణంలోని రెండో వార్డులో కొంతకాలంగా నీటి ఎద్దడి నెలకొన్నది. కాలనీలోని సంతోష్‌నగర్, సిక్కుల కాలనీవాసులు విషయాన్ని కౌన్సిలర్ సంగీత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె కొత్తగా బోరు వేయించి ప్రారంభించారు. నీటి ఎద్దడి తీరడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తంచేశారు.